పరమపదనాభుడిగా శ్రీవారు



పరమపదనాభ అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి.. పరమపదనాభుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఖాద్రీశుడి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారికి ఆదివారం అభిషేకాలు చేశారు. అనంతరం పరమపదనాభుడిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

జయహో భారత్..



పాక్‌పై టీమిండియా ఘన విజయంతో అనంతలో అంబరాన్నంటిన సంబరాలు

ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించడంతో అనంత నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలుపొందగానే.. వేల సంఖ్యలో అభిమానులు రోడ్లపైకి వచ్చారు. క్లాక్‌టవర్ వద్ద భారీగా గుమికూడారు. త్రివర్ణాన్ని చేత పట్టుకుని, జయహో నినాదాలతో హోరెత్తించారు. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

-అనంతపురం(ఆంధ్రజ్యోతి)

శ్రీచండీదేవిగా దుర్గమ్మ



శ్రీచండీదేవి అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి.. ఆదివారం శ్రీచండీదేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవాల ఏడోరోజు దుర్గాదేవికి అభిషేకాలు చేశారు. అమ్మవారిని శ్రీచండీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఒక్కలిగలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒక్కలిగ, వీరశైవ లింగాయత్, సాదర కులస్తులను కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 80వేల మందికి పైగా ఒక్కలిగలు, వీరశైవ లింగాయత్, సాదర కులస్తులు ఉన్నారన్నారు. ఆరు రాష్ట్ర పరిధిలో బీసీ జాబితాలో ఉండగా.. కేంద్రం మాత్రం ఓసీ జాబితాలో ఉంచిందన్నారు. తద్వారా ఆయావర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రంలోని జాతీయ బీసీ కమిషన్, కేంద్ర న్యాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

3న కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్స్..?

- ఖాళీలు, కౌన్సెలింగ్‌పై విద్యాశాఖ కసరత్తు

(వివరాలు 6లో..)

మన్నించు మన్రో..!

- మాయమౌతున్న మన్రో తోపు
- రోడ్ల విస్తరణతో కనుమరుగవుతున్న పచ్చని చెట్లు
- ఖాళీ స్థలాల్లో కబ్జారాయుళ్ల పాగా



జిల్లా మొదటి కలెక్టర్ థామస్ మన్రో



మన్రో తోపులో ఆక్రమణలు

చిలమత్తూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా మొదటి కలెక్టర్ థామస్ మన్రో నిర్మించిన హరితవనం కనుమరుగవుతోంది. మండలంలోని కోడూరు గ్రామ సమీపాన పచ్చదనం, ఆహ్లాదానికి మారుపేరుగా నిలిచిన మన్రో తోపు మాయమైపోతోంది. వేలకొద్దీ ఉన్న చెట్లపై గొడ్డలి వేటుపడుతోంది. పచ్చదనం హరించుకుపోతోంది. ఇది చాలదన్నట్లు కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. దీంతో 70 ఎకరాల్లో ఏర్పాటు చేసిన చారిత్రక మన్రో తోపు ప్రస్తుతం 25 ఎకరాలకే పరిమితమైంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కాపాడుకోకపోతే పూర్తిగా మాయమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

పెరిగిన ఆక్రమణలు

కొంత కాలంగా మన్రో తోపులో ఆక్రమణలు విపరీతమయ్యాయి. పచ్చని చెట్ల స్థానంలో కొందరు స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకున్నారు. కోడూరు తోపు 44వ, 342 జాతీయ రహదారులకు కూడలిగా మారడంతో ఈ ప్రదేశం చిరువ్యాపారులకు వరంగా మారింది. దీంతో వారు దుకాణాలను మన్రో తోపు స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డు విస్తరణ జరిగినపుడల్లా కొంచెం, కొంచెం వెనుక్కు వస్తూ ఇష్టానుసారంగా స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ఇదే తోపులో పురాతన కోదండ రామాలయం ఉంది. ఆలయం ప్రాంగణం ఇప్పటికే రోడ్ల విస్తరణతో కుంచించుకుపోయింది. ఆలయ ప్రాంగణాన్ని కూడా కబ్జాదారులు వదలట్లేదు. ఒకప్పుడు వేలాది సంఖ్యలో ఉన్న చెట్లు ఆక్రమణలతో ప్రస్తుతం పదుల సంఖ్యకు చేరుకున్నాయి. మన్రోతోపును సంరక్షించాల్సిన అధికారులు వారి కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవట్లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ తోపు గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉంది. పంచాయతీ అధికారులు సరిహద్దులను గుర్తించి కంచె వేయకపోవడంతో కొందరు మన్రో తోపు శివార ప్రాంతాలను ఆక్రమించుకుంటున్నారు. మన్రో తోపులో ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించింది. పచ్చని చెట్ల మధ్య పాఠశాల మంచి వాతావరణంలో ఉంది. రోడ్డుకు ఆనుకునే ఈ పాఠశాల ప్రాంగణం ఉంది. రోడ్డు విస్తరణలో బాగంగా రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణాలు తొలగించడంతో వారు వ్యాపారాలను కొనసాగించేందుకు వీలుగా ఇప్పుడు పాఠశాలకు కేటాయించిన స్థలంలో కబ్జాలకు తెరతీశారు. ఇప్పటికే పాఠశాల ప్రహరీ చుట్టూ దుకాణాలు వెలిశాయి. వాటిని అలాగే కొనసాగిస్తే పాఠశాల స్థలంలోకి చొరబడే అవకాశాలున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, మన్రో తోపును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆహ్లాదానికి మారుపేరు

బ్రిటిష్ పాలనలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో కోడూరు గ్రామ సమీపంలో కుషావతి నది పక్కన 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఒక వరుస క్రమంలో వందల సంఖ్యలో విప్ప, చింత మొక్కలను నాటించారు. అవి మహా వృక్షాలై శతాబ్దాలపాటు ఈ ప్రదేశం పచ్చదనంతో కళకళలాడింది. రెండు చోట్ల సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఈ తోపు వనాన్ని ఏర్పాటు చేశారు. పచ్చదనానికి మారుపేరుగా మారి ఎంతో ఆహ్లాదాన్నిచ్చే ఈ తోపులో జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, స్థానికులు సేద తీరేవారు. పచ్చని చెట్లతో కళకళలాడే మన్రో తోపు ఇప్పుడు రోడ్ల విస్తరణలో కనుమరుగైపోతోంది. గతంలో 44వ జాతీయ రహదారిని విస్తరించే క్రమంలో ఈ మన్రో తోపులో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను కూకటి వేళ్లతో పెకలించేశారు. ఇప్పుడు కోడూరు తోపు నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారిని నాలుగు లేన్ల రహదారిగా మార్చడంతో ఆ పనులు చురుగ్గా జరుగుతున్నారు. ఇందులో భాగంగా మన్రో తోపులో రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఇలా మన్రో తోపుకి రోడ్ల విస్తరణ పనులు శాపంగా మారాయని చెప్పవచ్చు.



కోడూరు మన్రో తోపులో ఎండిపోయిన విప్ప వృక్షాలు

చర్యలు తీసుకుంటాం



ఉమ్మడి జిల్లాలో మన్రో తోపునకు ఎంతో పేరు ఉంది. పచ్చదనానికి, ఆహ్లాదానికి మారు పేరుగా ఉండేది. రోడ్డు విస్తరణలో కొంతవరకు చెట్లు తొలగిస్తూ వచ్చారు. ప్రస్తుతం కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరు కబ్జాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటాం. మన్రో తోపులో మొక్కలు నాటి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటాం.

-భాస్కర్, కోడూరు పంచాయతీ కార్యదర్శి

అందరికీ ఉచిత వైద్యం


- అదే సత్యసాయి ఆశయం : ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలు, ధనికులు అనే తేడాలేకుండా అందరికీ ఉచిత వైద్యం అందించాలన్న ఆశయంతోనే సత్యసాయిబాబా ఆస్పత్రిని ప్రారంభించారంటూ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని శ్రీసత్యసాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్‌జే రత్నాకర్ ఆదివారం జ్యోతి వెలిగించి, కార్డియో వాస్క్యులర్ సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి బాబా 1956లో చిన్న ఆస్పత్రిని ప్రారంభించి ఉచిత వైద్యసేవలకు శ్రీకారం చుట్టారన్నారు. 1990-91లో పుట్టపర్తి, 1998లో బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి అతి ఖరీదైన వైద్యాన్ని సైతం అందరికీ ఉచితంగా అందిస్తున్నారన్నారు. సత్యసాయి ప్రారంభించిన ఉచిత వైద్యం, విద్య, తాగునీరు తదితర సేవలను ట్రస్టు ఆధ్వర్యంలో పారదర్శకంగా కొనసాగిస్తున్నామన్నారు. అనంతరం ట్రస్టు సభ్యుడు డాక్టర్ మోహన్, పుట్టపర్తి సూపర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, పలువురు వైద్యులు గుండె సంబంధిత సమస్యలు, చికిత్స గురించి వివరించారు. సదస్సులో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి 400 మంది వైద్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని, అర్జీలు సమర్పించాలన్నారు.

శ్రమతోనే గుండె భద్రం..!



మంచి ఆహారంతో ఆరోగ్యం

వ్యసనాలతో ముప్పు

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

(వివరాలు 6లో..)

వాహనాలు వెళ్లేదెలా?



రోడ్డుపై ఆరబోసేందుకు వేసిన మొక్కజొన్న విత్తనాలు

ఇది రొద్దం మండలంలోని కల్లుకుంట-పెద్దగువ్వలపల్లి రోడ్డు. కల్లుకుంట వద్దగల సుంకులమ్మ దేవాలయం సమీపాన తారు రోడ్డుపై గ్యాప్ వదలకుండా మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టారు. వాహనాలు వెళ్లే అవకాశం కూడా లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డు నాలుగు రోజుల క్రితమే వేశారు. పూర్తిగా ఆరనేలేదు. అప్పుడే మొక్కజొన్న కంకులు వేసి, ట్రాక్టర్‌తో తొక్కిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-రొద్దం(ఆంధ్రజ్యోతి)

బొప్పాయి రైతు కన్నీళ్లు..!



ఒక్క కోత కూడా కోయలేదు



నాలుగెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పంట పెట్టిన నెల రోజులకే తెగులు సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం దక్కలేదు. పెట్టుబడి పెరుగుతోందే తప్ప.. తెగులు అదుపులోకి రావట్లేదు. నష్టం భరించలేక పంటను తొలగించుకున్నా. ఒక్క కోత కూడా కోయలేదు. సర్వం నష్టపోయా.

-రామదాసు, రైతు, ఆత్మకూరు

లక్షలు పెట్టి.. పంట సాగు.. చుట్టుముట్టిన వైరస్

- ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని దుస్థితి
- తోటలను వదిలేస్తున్న రైతులు..
- సర్వం నష్టపోతున్న వైనం

వర్షాధార పంటలతో ఏటా నష్టాలే. వాటిని భరించలేక రైతులు అప్పులు చేసి.. బోరుబావులు తవ్వించుకున్నారు. వాటి కింద ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. పంట చేతికొస్తే.. అప్పులు తీరుతాయని ఆశ పడుతున్నారు. మరిన్ని అప్పులు చేసి.. బొప్పాయి పెట్టారు. పంట కోత సమయం దగ్గరపడుతోంది. ఈ తరుణంలో తెగులు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. నిండా ముంచేశాయి. ఎన్ని మందులు కొట్టినా.. అదుపులోకి రాలేదు. చేసేదిలేక, రైతులు తోటలను ధ్వంసం చేసుకుంటున్నారు. లక్షలు నష్టపోయి.. కన్నీళ్లు పెట్టుకుంటున్నారు..

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల కారణంగా బొప్పాయిని తెగులు చుట్టుముడుతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావట్లేదు. పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప.. ప్రయోజనం దక్కట్లేదు. దీంతో రైతులు పంటను వదిలేసుకుంటున్నారు. ఒక్క కోత కూడా వేయకుండానే రోటావేటర్‌తో ధ్వంసం చేస్తున్నారు. దీంతో లక్షల రూపాయలు నష్టపోతున్నారు. అప్పుల ఊబిలోకి (మిగతా 6లో...)

పంటను తొలగిస్తున్న దృశ్యం

జూనియర్ లైన్‌మన్‌కు ప్రమాదం

పరిస్థితి విషమం.. బళ్లారి విమ్స్‌లో చికిత్స

ఆపరేటర్ నిర్లక్ష్యమే కారణమంటున్న అధికారులు



గాయపడ్డ లైన్‌మన్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభంపై పనులు చేస్తుండగా జూనియర్ లైన్‌మన్‌కు షాక్ తగిలి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్ విద్యుత్ కార్యాలయంలో రామాంజనేయులు (38) విద్యుత్ గ్రేడ్-2 జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బొమ్మనహాళ్‌కు చెందిన వెంకటేశులు అనే రైతు పొలంలో విద్యుత్ మోటారుకు సరఫరా అయ్యే 11కేవీ విద్యుత్ హెడ్ ఫ్యూజ్ పోయిందని తెలిపాడు. దీంతో ఫ్యూజ్ వేసేందుకు వెళ్లాడు. కురువళ్లి, బొమ్మనహాళ్ ఫీడర్ల లైన్ విద్యుత్ సరఫరా కాకుండా స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ఎల్సీ తీసుకున్నాడు. ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో రామాంజనేయులు ఒక్కసారిగా కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్‌కు ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైదులు తెలిపారు. సమాచారం అందుకున్న రాయదుర్గం ఏడీఈ శ్రీనివాస్‌నాయుడు, బొమ్మనహాళ్ ఏఈఈ లక్ష్మిరెడ్డి.. బాధితుడిని పరామర్శించారు. ప్రమాదంపై విచారిస్తున్నారు. ఆపరేటర్ తప్పిదమే కారణమన్న అనుమానాలు ఉన్నాయని, దీనిపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ నబీరసూల్‌ను అడగ్గా.. లైన్‌మన్ భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలుడి మృతి ఘటనలో స్టాఫ్‌నర్సు సస్పెన్షన్

ఉరవకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్ల బాలుడు అహరూన్‌కుమార్ (5) మృతి చెందిన ఘటనలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సు ప్రియాంకను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 25న వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన రాజేష్, సరిత దంపతుల కుమారుడు అహరూన్ కుమార్ వైద్యం అందక మరణించాడని కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వరాజ్, వైద్యుడు, నర్సుతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. వారితో రాతపూర్వకంగా వాంగ్మూలం తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్టాఫ్‌నర్సు ప్రియాంకను సస్పెండ్ చేశారు. డాక్టర్‌పై తదుపరి చర్యల కోసం వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు విచారణ నివేదికను పంపారు. బాలుడి మృతి ఘటనపై కలెక్టర్.. ముగ్గురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించినట్లు సమాచారం.

రాజస్థాన్ వాసి ఆత్మహత్య

రామగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని ఓ వంకలో రోడ్డు పక్కనే చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన దేవరాం(30) రామగిరి సమీపంలో సోలార్ పనులు చేయడానికి వచ్చాడు. కొన్ని రోజులుగా ఇక్కడే పనులు చేసుకుంటూ ఉండేవాడు. శనివారం రాత్రి తోటి కూలీలతో ఉన్న దేవరాం రామగిరికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. షర్టుతో చెట్టుకు ఉరివేసుకున్నాడు. తెల్లవారుజామున ఆ దారి వెంట వెళ్లే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దేవరాం అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడని, దీంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- అనాథలైన ఇద్దరు పిల్లలు



సరస్వతి (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన డేరంగుల సరస్వతి (35) కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకునేది. ఆదివారం ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా విద్యుత్ మోటారును పక్కకు జరిపే సమయంలో విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. సరస్వతి భర్త రాజశేఖర్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు జ్యోతిఈశ్వర్, నిఖిల్ ఉన్నారు. వారు 8, 6 తరగతులు చదువుతున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే పిల్లలను ఆదుకుని చదివించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు ఢీకొని 13 గొర్రెల మృతి



గొర్రెల కళేబరాలు

బత్తలపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటాపురం సమీపాన బైపాస్ రోడ్డులో ఆదివారం గొర్రెల మందను కారు ఢీకొన్న ప్రమాదంలో 13 గొర్రెలు మృతి చెందినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. గంటాపురం గ్రామానికి చెందిన భూమే అప్పస్వామి కుటుంబ పోషణ కోసం కొద్ది రోజుల క్రితం 50 గొర్రెలను తెచ్చుకొని మేపుతున్నాడు. ఆదివారం గొర్రెలను మేతకు తోలుకెళుతుండగా.. అనంతపురం నుంచి కదిరి వెళుతున్న కారు గంటాపురం సమీపంలోకి రాగానే రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొంది. ప్రమాదంలో 13 గొర్రెలు మృతి చెందడంతో కాపరి బోరున విలపించాడు. లక్షా యాభై వేల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10వేలు, సరాసరి ధర రూ.15తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

3న కొత్త టీచర్లకు ప్లేస్‌మెంట్స్..?

ఖాళీలు, కౌన్సెలింగ్‌పై విద్యాశాఖ కసరత్తు



ఖాళీలపై సమాచారం సేకరిస్తున్న విద్యాశాఖ ఐటీ సెల్ సిబ్బంది

అనంతపురం విద్య, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలలో పోస్టులకు అర్హత సాధించిన కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించడానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 755 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి ఈనెల 25న అమరావతిలో సభ ఏర్పాటు చేసి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దీంతో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ప్లేస్‌మెంట్స్ కేటాయించాల్సి ఉంది. కొత్త టీచర్లకు అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకటించడంతో శిక్షణ తర్వాత కౌన్సిలింగ్ నిర్వహిస్తారనే ప్రచారం సాగింది. సర్వీస్ పరిగణనలోకి రావాలంటే తప్పనిసరిగా ప్లేస్‌మెంట్స్ కేటాయించాలి. అపుడే జీతాలు ఇవ్వడానికి సమస్య ఉండదని ఆ శాఖ అధికారులు అంటున్నారు. ఆ మేరకే అక్టోబరు 3న కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలో ప్లేస్‌మెంట్లు కేటాయించడానికి రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కమిషనర్ విజయరామరాజు కూడా 3న కౌన్సిలింగ్ ఉంటుందని, ఖాళీల వివరాలు పంపాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో జిల్లాలో ఖాళీల వివరాలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఆదివారం సెలవు రోజు కూడా ఐటీ సెల్ సిబ్బంది అన్ని మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు ఫోన్‌లు చేస్తూ.. ఖాళీల సమాచారాన్ని సేకరించారు. ముందు పూర్తి టీచర్లు లేని స్కూళ్లకు, సబ్జెక్టు కొరత ఉన్న హైస్కూళ్లకు, గత బదిలీలలో బదిలీ అయ్యి రిలీవర్ లేకపోవడంతో అక్కడే పనిచేస్తున్న టీచర్ల స్థానాలకు కొత్తవారిని కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లాలో దూర మండలాలలోనే అత్యధిక పాఠశాలలో ఖాళీలు ఉన్నాయి. కౌన్సిలింగ్ 3న జరిగితే.. 4నుంచి 13వ తేదీ వరకు శిక్షణ జరిగే అవకాశం ఉందని ఆ శాఖ ద్వారా తెలుస్తోంది.

బొప్పాయి రైతు కన్నీళ్లు..!

(5వ పేజీ తరువాయి)

కూరుకుపోతున్నారు. ఆత్మకూరు మండలంలోనే దాదాపు 1200 ఎకరాల్లో పంటను తొలగించుకునే పరిస్థితి దాపురించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

2 వేల ఎకరాల్లో సాగు



తెగుళ్లు సోకిన బొప్పాయి తోట

మండలంలో 2వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో బొప్పాయి పంట పెట్టారు. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కోత కోయాల్సిన సమయం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవలిగా కురుస్తున్న వరుస వర్షాలు, ఆకాశం మేఘావృతమూ ఉండడం అన్నదాత ఆశలపై నీళ్లు చల్లుతోంది. పంటను మజ్జిగ తదితర తెగులు చుట్టుముట్టాయి. రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి, వాటికి మందులు పిచికారీ చేస్తున్నారు. పలు రకాల మందులు కొడుతున్నా.. అదుపులోకి రావట్లేదు. ఇక ఏమందు కొట్టాలో అర్థం కావట్లేదు, చెప్పే అధికారి కూడా లేదు. ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప.. తెగులు అదుపులోకి రావట్లేదు. ఇక చేసేదిలేక రైతులు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు రైతులు ఒక కోత కోశారు. మిగతావారు ఒక్క కోత కూడా వేయలేదు. పంటను తొలగించుకుంటున్నారు. దీంతో లక్షల రూపాయల పెట్టుబడులు మట్టిలో పోస్తున్నారు. మండలంలో 1200 ఎకరాల్లో పంటను కోత కోయకుండానే తొలగించుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రూ.3 లక్షలు పెట్టుబడి.. రూ.15వేలు రాబడి



మూడెకరాల్లో బొప్పాయి సాగు చేశా. రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. పంటకు మజ్జిగ తెగులు విపరీతంగా సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాలేదు. ఒకే ఒక కోత కోశా. 2.5 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. పంటను విక్రయించగా.. రూ.15 వేలు మాత్రమే వచ్చింది. కాయలను మార్కెట్‌కు తరలించే ఖర్చులు కూడా దక్కలేదు. మొత్తం నష్టపోయా.

-రైతు మహేష్‌రెడ్డి, ఆత్మకూరు

మొజాయిక్ తెగులు సోకింది

బొప్పాయికి రింగ్స్‌తోపాటు మొజాయిక్ తెగులు అధికంగా సోకుతోంది. తెల్లదోమ కారణంగా ఇవి వ్యాపిస్తున్నాయి. తెగుళ్ల నివారణకు వేప నూనెగానీ, కానుగ నూనెగానీ పంటలకు పిచికారీ చేసుకోవాలి. తద్వారా ఆకులపై పలుచటి పొర ఏర్పడుతుంది. ఆకులోని రసాన్ని పీల్చే అవకాశం లేక తెగులు తగ్గిపోతుంది.

-దివ్య, ఉద్యాన శాఖాధికారి

మానవతావాది.. గుర్రం జాషువా

మంత్రి సత్యకుమార్ యాదవ్



పల్లకిలో గుర్రం జాషువా చిత్రపటాన్ని మోసుకెళ్తున్న మంత్రి సత్యకుమార్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): తెలుగునేల కన్న ముద్దుబిడ్డ గుర్రం జాషువా గొప్ప జాతీయ మానవతావాది అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమలానగర్‌లో బీజేపీ జెండా ఎగురవేశారు. అనంతరం జడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం, సప్తగిరి సర్కిల్ మీదుగా అలెగ్జాండర్ హోటల్ వరకు గుర్రం జాషువా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. స్వయంగా పల్లకి మోసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో మాట్లాడారు. కలాన్నే ఆయుధంగా మలుచుకున్న గుర్రం జాషువా.. సమాజంలోని రుగ్మతలు, అసమానతలు, కుల గోడలను కూలదోసేందుకు కృషిచేసిన ఆధునిక వైతాళికుడు అని కొనియాడారు. గొప్ప పనులు చేసి, ప్రజలను చైతన్యం చేసిన మహానుభావుల విగ్రహాలను పెట్టాల్సిన చోట రాజకీయ నాయకుల విగ్రహాలు పెట్టడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జిన్నా విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన మంత్రి... ఆ స్థానంలో గుంటూరు జిల్లా వాసి జాషువా విగ్రహం ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేపడుతూ స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తెలుగు భాషను నిర్వీర్యం చేసిందని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా బీజేపీ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు రత్నమయ్య, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, మారుతిగోవింద ప్రసాద్, నాగరాజు, మల్లిక, చైతన్య, కవితాశర్మ, అయ్యన్న, భీమశేఖర్, లక్ష్మిదేవి, ఆవుల చక్రధర్ యాదవ్, ఇలియాజ్, దేవరాజు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వీడకుంటే ఉధృత పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా 11వ మహాసభలు ఆదివారం ముగిశాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సభకు నర్సింగరావుతోపాటు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హాజరయ్యారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి హాజరై మహాసభలకు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలు, హక్కులు, వేధింపులు, తొలగింపులు, ప్రభుత్వ విధానాలపై 15 తీర్మానాలను సభ ఆమోదించింది. 8 గంటల పనివిధానాన్ని రద్దు చేస్తూ 10 గంటల పనివిధానానికి అసెంబ్లీలో తీర్మానించడం, మహిళలు రాత్రిపూట విధులు చేయాలనడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ రెగ్యులర్ చేయాలనే డిమాండ్లను తీర్మానించారు. అనంతపురం జిల్లాకు కల్పవృక్షంగా ఉన్న ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేసి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం 59 మందితో సీఐటీయూ జిల్లా నూతన కమిటీని, వారిలో 19 మందిని ఆఫీస్ బేరర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్‌వీ నాయుడు, గోపాల్, వెంకటనారాయణ, రామాంజనేయులు, ముర్తుజా, శ్రీనివాసులు, రమాదేవి, శకుంతల, శివప్రసాద్, నాగభూషణం, సాకే నాగరాజు, నాగార్జునరెడ్డి, ఏటీఎం నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ప్రైవేటీకరణ సంస్కరణలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటీకరణ వల్ల ఇటు ప్రజలు, కార్మికులకు, ప్రభుత్వానికీ నష్టం జరుగుతోందని, యాజమాన్యాలు మాత్రమే లాభపడుతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగంలో అతి ప్రమాదకరమైన పనులు చేస్తూ కార్మికులు మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత, ఆదరణ లేకుండా పోతోందన్నారు. సిమెంట్ పరిశ్రమల్లో కార్మికులంతా కాంట్రాక్టు కార్మికులుగా అతితక్కువ వేతనాలతో పనిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధమవుతున్నామని అన్నారు. డిసెంబరు 31, జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... పేదరికాన్ని నిర్మూలించేందుకు పీ4 విధానం అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చెబుతుండడం నమ్మశక్యంగా లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

శ్రమతోనే గుండె భద్రం..!

మంచి ఆహారంతో ఆరోగ్యం

వ్యసనాలతో ముప్పు

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



అనంతపురం వైద్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండె లబ్‌డబ్ శబ్దాలు నిరంతరాయంగా సాగాలంటే శారీరక శ్రమ ఉండాల్సిందే. వ్యాయామం, పొలం పనులు ఏరూపంలోనైనా దేహానికి పనికల్పించాలి. తక్కువ కొవ్వు పదార్థాలు ఉన్న నాణ్యమైన ఆహారం భుజించాలి. అప్పుడే మీ హార్ట్ బీట్ మిస్ కాకుండా ఉంటుంది. మీతో పాటు మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా జీవించాలంటే గుండెను భద్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 'డోంట్ మిస్ ఏ బీట్' అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నారు.

వంశపారంపర్యంగా..

గుండె జబ్బులు వంశ పారంపర్యంగా వచ్చే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ధూమ, మద్యపానం సేవించడం, సమతుల్యతలేని అహారాన్ని తీసుకోవడం, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు గుండెకు ప్రమాదకరంగా పొంచి ఉండే అంశాలు. అధిక ఒత్తిడి, మానసికంగా కుదుటలేకపోవడం, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపకపోవడం, నిద్రలేమి తదితర కారణాలు గుండె జబ్బులకు మూలమని చెబుతున్నారు.

40 దాటితే పరీక్షించుకోవాల్సిందే..

ఆరోగ్యంగా ఉన్నాం మాకేంటని నిర్లక్ష్యం చేయకుండా 40 సంవత్సరాలు పైబడి వారంతా గుండె పరీక్షలు చేయించుకోవాల్సిందేనని డాక్టర్లు సూచిస్తున్నారు. కళ్ల ముందే తిరుగుతున్న వ్యక్తి ఉన్నఫలంగా కిందపడిపోవడం చూస్తుంటాం. ఏ అర్ధరాత్రో, అపరాత్రో నిద్రలోనే మరణిస్తుంటారు. శరీరంలో అప్పటికే అనారోగ్య సమస్యలు ఉన్నా బయటకు కనిపించకపోవడంతో ఇలాంటి విపత్కర పరిస్థితులు దాపురిస్తుంటాయని పేర్కొంటున్నారు. ఆరోగ్య పరీక్షలతోపాటు కూరగాయలు, పండ్లు, వ్యాయామం నిత్యజీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచిస్తున్నారు. మీ గుండె భద్రంగా ఉండాలంటే మీ అలవాట్లు మంచిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రాథమికంగానే వైద్యులను సంప్రదించాలి



అకస్మాత్తుగా ఛాతీలో బరువు, మంటగా ఉండటం, చేయి, దవడకు నొప్పి పాకడం వంటి గుండెపోటు లక్షణాలు ప్రాథమికంగా కనిపిస్తాయి. అలాంటి సమయంలో తక్షణమే డాక్టర్‌ను సంప్రదించాలి. పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించడం ద్వారా ప్రమాదం నుంచి తప్పించవచ్చు. ఆసుపత్రికి సకాలంలో చేరుకోవాల్సి ఉంటుంది. మంచి ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం వంటి శారీరక శ్రమను చేయడం ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

-డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజీ విభాగం, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

పీఎండీడీకేవై కింద 'అనంత' ఎంపిక

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన్(పీఎండీడీకేవై) కింద అనంతపురం జిల్లా ఎంపికైందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 100 జిల్లాలు ఎంపికైతే... అందులో అనంతపురానికి కూడా చోటు దక్కిందన్నారు. పీఎండీడీకేవై కింద జిల్లా ఎంపిక కావడం వల్ల జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి విశేషంగా తోడ్పాటు అందుతుందన్నారు. ముఖ్యంగా రైతుల పంట ఉత్పాదకతను పెంచుతుందని, పంటల వైవిధ్యాన్ని, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తుందని వివరించారు. పంట సాగు, ఉత్పత్తుల తర్వాత నిల్వ, విలువ జోడింపు, మౌలిక వసతులను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. 2025-2026 నుంచి ఆరేళ్లపాటు ఈ పథకం అమలవుతుందని, జిల్లా రైతాంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జిల్లా ఎంపిక కావడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారని పేర్కొన్నారు.

రేబీస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్



కుక్కకు రేబీస్ టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జంతువుల నుంచి రేబీస్ వ్యాధిసోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ సూచించారు. ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం సందర్భంగా ఆదివారం స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆసుపత్రిలో కుక్కలకు రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆసుపత్రి ఏడీ సురేష్, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

4న మండల సర్వసభ్య సమావేశం

నంబులపూలకుంట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అక్టోబరు 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్థసారథి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తనకల్లు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షాబుద్దీన్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డ్రైవర్ వెంకటేష్‌నాయక్

కదిరి అర్బన్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగ్‌ను అతడికి అందించి ఆర్టీసీ డ్రైవర్ వెంకటేష్‌నాయక్ నిజాయితీ చాటుకున్నారు. కదిరి డిపోకు చెందిన బస్సు బెంగళూరు నుంచి చింతామణి మీదుగా శనివారం ఉదయం కదిరికి చేరింది. బస్సుదిగి ప్రయాణికులు కదిరి నరసింహ స్వామి దర్శనానికి చేరుకున్నారు. వారు దిగిపోయిన తరువాత బస్సులో ఓ బ్యాగ్‌ను గమనించిన డ్రైవర్ దానిని తీసుకెళ్లి బస్టాండ్‌లో కంట్రోలర్ ఉత్తన్నకు అందించారు. ఆ సమయంలో బ్యాగ్‌లో ఉన్న ఫోన్ రింగ్ అయింది. తాను బ్యాగ్ పోగొట్టుకున్నానని, అందులో ఫోన్ ఉందని చింతామణికి చెందిన శివకుమార్ తెలిపారు. దీంతో ఆదివారం శివకుమార్‌కు బ్యాగ్‌ను, ఫోన్‌ను అందజేశారు. ఆర్టీసీ వారికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ


వృద్ధులకు చీరలను పంపిణీ చేస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్లూరు అనాధా శ్రమంలో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆదివారం వృద్ధులకు చీరలను పంపిణీచేశారు. తన తల్లి పేరం స్వర్ణకుమారి ప్రథమ వర్ధంతి సందర్భంగా పంపిణీచేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన అన్నదానం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ కేతన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు - ఇద్దరికి గాయాలు

నల్లచెరువు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జోగన్న పేట వద్ద ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న రమాదేవి, శ్రీనివాసులు దంపతులకు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలలోని జోగన్న పేటకు చెందిన దంపతులు రమాదేవి, శ్రీనివాసులు ఆదివారం స్వగ్రామం నుంచి కదిరికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే మదనపల్లి నుంచి కదిరికి వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు బంధువులు, స్థానికులు తెలిపారు.

వేల్పుమడుగులో చోరీ


చోరీపై వివరాలు ఆరాతీస్తున్న ఏఎస్ఐ

బత్తలపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వేల్పుమడుగులో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ ఆదివారం తెలిపారు. వేల్పుమడుగు గ్రామానికి చెందిన చిన్న చెన్నారెడ్డి తన కుటుంబంతో కలసి రెండు రోజుల క్రితం దైవదర్శనానికి అహోబిలం వెళ్లారు. శనివారం తిరిగి రాగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా బద్దలు కొట్టి, అందులోని రెండు జతల బంగారం కమ్మలు, ఓ బంగారం చైను (3.5తులాలు), రూ.5వేలు నగదు పోయినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ సోమశేఖర్ గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ధర్మవరం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు నితిన్(12) అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనంలో నితిన్ వెనుక కుర్చొని వెళ్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నితిన్ తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యంకోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. తండ్రి ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకుల పరామర్శ

బాలుడు నితిన్ మృతిచెందిన విషయం తెలుసుకున్న చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధా రాఘవతో పాటు జింకా పురుషోత్తం, దాసరి నర్సి, మాల్యవంతం నారాయణస్వామి, చంద్రమౌళి ఆదివారం నితిన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంధారాఘవ కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.


బాలుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సంధా రాఘవ


కదిరిలో వారాహి మాతగా కన్యకాపరమేశ్వరి




సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసనగర్‌లో వెంకటేశ్వర స్వామి ←

కొత్తచెరువులో ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ దేవత →

శ్రీమాత్రే నమః

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం ప్రశాంతి నిలయంలోని గాయత్రిమాత, మామిళ్ళకుంట లలితాపరమేశ్వరి సరస్వ తి దేవిగా దర్శమిచ్చారు. జిల్లాకేంద్రంలోని వాసవీ మాత అన్నపూర్ణగా, సత్యమ్మ దేవత, ఎనుమలపల్లి దుర్గాదేవి మహాచండిగా దర్శనమి చ్చారు. ధర్మవరం పట్టణంలో సూర్యప్రభ వాహనంపై శ్రీనివానగర్ వెంకటేశ్వరస్వామి, మధుర మీనాక్షిగా గాంధీనగర్ చౌడేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తచెరువులోని పెద్దమ్మను మహాచండిగా, బత్తలప ల్లిలో అమ్మవారిని మహేశ్వరీ దేవిగా అలంకరించారు. గాండ్లపెంట మండలపరిధిలోని కటారుపల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరి పట్టణంలో కన్యకాపర మేశ్వరి వారాహి మాతగా, కుమ్మరవాండ్లపల్లి మల్లాలమ్మ గజలక్ష్మిగా, చౌడేశ్వరీదేవి పార్వతీదేవిగా, తనకల్లులో కన్యాకపరమేశ్వరి వెంకటరమణస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు.




పుట్టపర్తిలో మహాచండిగా సత్యమ్మ, అన్నపూర్ణేశ్వరిగా వాసవీమాత


కదిరిలో పార్వతీదేవిగా చౌడేశ్వరి


బత్తలపల్లిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


తనకల్లులో వెంకటరమణస్వామి అలంకరణలో కన్యాకపరమేశ్వరి

ప్రపంచ వేదికపై దేశగౌరవాన్ని నిలిపిన మోదీ

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్


ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత గౌరవాన్ని ప్రపంచ వేది కపై నిలబెట్టిన వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అని రాష్ట్ర వైద్య ఆరో గ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రదర్శనను పట్టణం లోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ...మన దేశ ప్రగతికి, పేదల సంక్షేమానికి, రైతుల అభ్యు న్నతికి, మహిళల సాధికారతకు ప్రధాని అమలు చేసిన పథకాలు చరిత్రాత్మకమైనవన్నారు. ప్రధాన మంత్రి జనధన్ యోజన ద్వారా పేదల కు బ్యాంక్‌ఖాతాలు, ఉజ్వల యోజన ద్వారా గ్యాస్‌కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యబీమా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఆర్థికసాయం, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా శుభ్రత వంటి పథకాలన్నీ దేశవ్యాప్తంగా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, నాయకులు గుండా పుల్లయ్య, నబీరసూల్ పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి


కవి ఏలూరు ఎంగన్నను సన్మానిస్తున్న జీఎం శేఖర్, గుడిసె దేవానంద్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆర్వీజే కళ్యాణమండపంలో కవకోకిల గుర్రంజాషువా 130వ జయంతి వేడుకలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు ఆర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కవి ఏలూరి ఎంగన్న, మాణిక్యం ఇషాక్, సమ్మెట మాధవ రాజు హాజరుకాగా వారిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరికృష్ణ, కత్తిరాజారెడ్డి, సురేంద్రబాబు, కళ్యాణ్‌కుమార్, సోకేరామాంజినేయులు, బాలగంగాధర్, సునీల్ వైట్ల, దేవేంద్ర అమర తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం: మంత్రి


మంత్రి నుంచి ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపట్ల ఆసక్తి చూపితే, అవి ఆరోగ్యంతో పాటు భవిష్యత్తుకు దోహదపడతాయని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోని ఎన్జీఓ హోంలో షటిల్‌టోర్నీ ఫైనల్స్ నిర్వ హించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి డోలారాజారెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీ లు జరిగాయి. టోర్నీలో విజేతలైన డాక్టర్ మదనమోహన్, ఆదినా రాయణకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా రూ.10వేలు నగదు బహుమతి, మెమెంటో అందజేశారు. రన్నర్స్ విజయ్, గుణకు రూ.7000 నగదు, మెమెంటో, తృతీయ బహుమతిగా పురుషోత్తం, చైతూకు రూ.5వేలు, మెమెంటో, నాలుగో బహుమతిగా డోలా రాజారెడ్డి, నరేంద్రకు రూ.3వేలు, మెమెంటోని మంత్రి అందజేశారు. అనంతరం విదేశీ వస్తువుల వాడకం తగ్గించి స్వదేశీ వస్తువుల వాడా లని ప్రతిజ్ఞ చేయించారు. నాయకులు సీతారామయ్య, ముత్యాలప్ప, బ్రహ్మానందరెడ్డి, భగవంతరెడ్డి, కిరణ్, భాస్కర్, నరేశ్, రాజా పాల్గొన్నారు.

కాలువల్లో కదలని మురుగు

● దోమలు, దుర్వాసనతో ప్రజలు సతమతం


ఎస్సీ కాలనీలో నిలిచిన మురుగు

బత్తలపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. దోమలు వృద్ధిచెంది ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల వాసులు మండిపడుతున్నారు. మండలకేంద్రమైన బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ, మైనార్టీ కాలనీలలో ఈ పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ కాలువలు చెత్త చెదారంతో పూడిపోయాయి. మురుగు ముందుకు కదలక నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. డ్రైనేజీ కాలువలను నెలలు గడిచినా శుభ్రం చేయడం లేదన్నారు. నిల్వ ఉన్న మురుగుతో వెదజల్లుతున్న దుర్వాసన భరించలేక పోతున్నామని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా దోమల దాడితో పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి రూ. వేలు ఖర్చుచేసుకుంటున్నామని, వైద్య సిబ్బంది ఇటువైపు చూడడం లేదని ప్రజలు వాపోతున్నారు. డబ్బులు ఇచ్చిన వారి ఇళ్ల, హోటళ్ల, చికెన్ సెంటర్లు, దుకాణాల వద్దే పంచాయతీ కార్మికులు శుభ్రం చేస్తున్నారని, మిగిలిన ప్రాంతాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. విషయం తెలిసినా అధికారులు తెలియనట్లు మిన్నకుండిపోతున్నారని మండిపడుతున్నారు. పైగా పంచాయతీ కార్మికులు కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, ఈ కాలనీల్లో ఫాగింగ్ చేయడం మరిచిపోయారని అంటున్నారు. ఫాగింగ్ చేయక దాదాపు ఎనిమిదేళ్లు అవుతోందంటున్నారు. గతంలో టీడీపీ హయాంలో మాత్రమే ఫాగింగ్ చేశారని ఆ తరువాత ఇటువైపు తొంగి చూడలేదని చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ కాలనీల గురించి పట్టించుకోకుండా చిన్న చూపు చూస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

జ్వరానికి రూ. 5 వేలు ఖర్చయింది



ఇటీవల నాతో పాటు నా ఇద్దరు కుమారులకు జ్వరం వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చికిత్సలు చేయించుకున్నారు. రూ.5వేలు ఖర్చు చేసుకున్నా. నెల రోజుల నుంచి వైద్య సిబ్బంది కనీసం ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. -సుజాత, ఎస్సీ కాలనీ

ఫాగింగ్ చూడక ఎనిమిదేళ్లు అయింది



మా కాలనీల్లో డ్రైనేజీ కాలువలను చాలా రోజుల నుంచి శుభ్రం చేయలేదు. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దోమలను నివారించే విషయాన్ని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫాగింగ్ చేయక దాదాపు ఎనిమిదేళ్లు అయింది. ఫాగింగ్ చేస్తే కొంత వరకు దోమలు తగ్గుతాయి.

-వన్నూరమ్మ, ఎస్సీ కాలనీ

పైపు లీకేజీతో తాగునీటి వృథా


మల్లేనిపల్లిలో పైపు నుంచి వృథాగా పోతున్న నీరు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లిలో తాగునీటి పైపు లీకేజీ అయి నీరంతా వృథాగా పోతోంది. గ్రామంలో పశువుల తొట్టికు ఏర్పాటుచేసిన పైపులైన్ లీకేజీ అవుతోంది. మోటారు ఆఫ్ అయినప్పుడు లీకేజీ వద్ద మట్టి అంతా పైపులోకి చేరుకుని, తిరిగి మోటారు ఆన్ చేయగానే మట్టితో కలిసిన నీరు వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైపు లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు ఆర్డీటీ ఆస్పత్రిని సందర్శించనున్న సీపీఐ రామకృష్ణ

బత్తలపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ సోమవారం సందర్శించనున్నట్లు సీపీఐ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య తెలిపారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎస్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించడం లేదన్నారు. దీంతో రామకృష్ణ ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించి అందులో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీయనున్నట్లు కాటమయ్య తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేశు, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణితో ఇబ్బందులు

● సీపీఎం నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లమాడ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆధిపత్య ధోరణ వల్ల ప్రపంచ దేశాలపై వాణిజ్యపన్నులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు సీపీఎం మండల కార్యదర్శి గోవిందు ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నిరసన తెలిపారు. అమెరికా వాణిజ్య పన్నుల వల్ల రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్స్, పట్టు, వ్యవసాయ, ఉద్యాన పంటల ధరలు పడిపోతున్నాయన్నారు. బడుగు, బలహీనవర్గాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం జోక్యం చేసుకుని అమెరికా ఆధిపత్య ధోరణిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యల్లప్ప, రామక్రిష్ణ, ముని పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కదిరి అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో దసరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. తొలిరోజు అండర్-14 విభాగంలో కదిరి జూనియర్ లయన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 185 పరుగులు చేసింది. మొదట ఆరు వికెట్లు తక్కువ స్కోరుకే పడిపోయినా విక్రమ్ 92, అఖిల్ 20 పరుగులతో రాణించారు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన కదిరి జూనియర్ టైగర్స్ జట్టు 120 పరుగులకే ఆలౌట్ అయింది. జూనియర్ లయన్స్ జట్టు బోలర్లు బాలాజీ 4, నిర్విజ్ఞ చెరో రెండు వికెట్లు తీశారు. లయన్స్ జట్టు విజయ సాధించింది. మరో మ్యాచ్‌లో కదిరి టైటాన్స్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 92 పరుగులు చేశారు. వీరిలో ప్రణయ్ 32, సాద్ 20 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన కదిరి రైజింగ్ స్టార్స్ జట్టు 4 వికెట్లు కోల్పోయినా, చివరి ఓవర్లో విజయం సాధించింది. ఈ పోటీలను జిల్లా క్రికెట్ సంఘం కోశాధికారి ప్రారంభించారు. విజయం సాధించిన జట్లను సీనియర్ క్రీడాకారు లు మహబూబ్‌బాషా, మనోహర్ తదితరులు అభినందించారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

● ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్టేట్ కోఆర్డినేటర్

కదిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుద్యోగులు, మహిళ సంఘాల సభ్యులు పరిశ్రమలు స్థాపించడానికి తగిన ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్టేట్ కోఆర్డినేటర్ మారుతి తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని మాధవ గురుకులంలో మాట్లాడుతూ... మహిళలు, రైతులు, యువత ఆహార సంబంధ పరిశ్రమను పెట్టడానికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. పరిశ్రమలు స్థాపించిన వారికి 35 శాతం సబ్సిడీ సదుపాయం ఉంటుందన్నారు. పరిశ్రమలు ఏవిధంగా ప్రారంభించాలో సూచనలు, సలహాలు ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ హేమలత, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

'మానవతా సంస్థ ద్వారా మరిన్ని సేవలు'

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ ద్వారా ప్రజలకు మరింత సేవలు అందించేలా అందరూ తమ సహాయ సహకారాలు అందించాలని ఆ సంస్థ అధ్యక్షుడు జగ్గా వేణుగోపాల్, కార్యదర్శి సాయిప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని బసవన్న కట్ట వీధిలో ఉన్న త్రిలింగేశ్వర ఆలయంలో ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి, సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనం తరం విశ్రాంత ఉపాధ్యాయుడు శేఖర్‌ను సన్మానించారు. సంస్థ ముఖ్యులు మంజునాథ్, చంద్రశేఖర్, చిన్నప్ప, సోమేశ్వరరెడ్డి, మనోహర్‌గుప్తా, రవికుమార్, పల్లెం జనార్దన్, నాగేశ్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితులకు కౌన్సెలింగ్

కదిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులు, మహిళలపై దౌర్జన్యం కేసుల్లో నిందితులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. 15 కేసుల్లో నిందితులైన 30 మందికి పట్టణ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా అవగాహన కల్పించామన్నారు. ఆయనతోపాటు పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

అంతర కళాశాలల పోటీలకు ధర్మవరం విద్యార్థి


మణిదీప్

ధర్మవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మణిదీప్ అనే విద్యార్థి అంతర కళాశాలల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు కోచ్ పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మణిదీప్ అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 25న నిర్వహించిన కబడ్డీ క్రీడాకారుల సెలెక్షన్స్‌లో మణిదీప్ ఉత్తమ ప్రతిభ కనబరచి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని కోచ్ తెలిపారు. దీంతో మణిదీప్‌ను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు అనిల్, పృథ్వీ, రాజశేఖర్ అభినందించారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం: డీఎస్పీ



బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యువతకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని డీఎస్పీ మహేష్ అన్నారు. ఆదివారం ఎంజీఎం క్రీడా మైదానంలో రెండ్రోజులపాటు నిర్వహించిన కుస్తీ పోటీలు ముగిసాయి. ఐదో రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన పలువురు యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, కరీముల్లా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతకన్నా ముఖ్యమన్నారు. కుస్తీ పోటీలవల్ల శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందన్నారు. దీంతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవచ్చన్నారు. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో 36మంది విజేతలుగా నిలిచారు. విజేతలు త్వరలో అయోధ్యలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర రెజ్లింగ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ అన్నారు. కార్యక్రమంలో పూలకుంట సర్పంచ్ మంజునాథ్, రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, సాయిసుమతి, సాయిలత, సురేంద్రరెడ్డి, సుమశీన, శివ పాల్గొన్నారు.

గంజాయి జోలికెళ్తే గ్రామ బహిష్కరణ

హిందూపురం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవించినా, విక్రయించినా గ్రామ బహిష్కరణ తప్పదని డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయులు హెచ్చరించారు. ఆదివారం రాత్రి పూలకుంటలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పేకాట, మట్కా, గంజాయితో పట్టుబడితే రౌడీషీట్ ఓపెన్ చేసి గ్రామానికి రాకుండా చేస్తామన్నారు.



గోరంట్లలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి వారాహి అలంకరణ



మడకశిరలో చండీదేవి అలంకరణలో వడిసలమ్మ



పెనుకొండలో ప్రత్యంగరీదేవి అలంకరణలో వాసవీమాత



సోమందేపల్లిలో మధుర మీనాక్షిగా చౌడేశ్వరి అమ్మవారు



హిందూపురంలో కల్కి అవతారంలో దర్శనమిస్తున్న వేంకటేశ్వరుడు

జగజ్జననీ... పాహిమాం..

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చిన భక్తాదులకు ప్రసాదం, అన్నదానం నిర్వహించారు.

అపూర్వ కలయిక



తమ గురువులతో పూర్వ విద్యార్థులు

పెనుకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత బాలుర పాఠశాలలో 40ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలిశారు. 1985-86 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చదువుచెప్పిన ఉపాధ్యాయులు తిప్పేస్వామి, ఆనంద్‌రావు, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శెక్షావలి, శ్రీనివాసు, విజయ్, విక్రం, గిరీ, నాగరాజునాయక్, మతీన్, హరి, రామాంజనేయులు, మధు పాల్గొన్నారు.

చిత్రావతి వంతెన పనులు చేపట్టండి

ఈఎన్సీ బాలూనాయక్ ఆదేశాలు



చిత్రావతి నది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈఎన్సీ

గోరంట్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్రవతి వంతెన పనులు వెంటనే చేపట్టాలని ఈఎన్సీ బాలూనాయక్ ఆదేశించారు. మండలంలోని బూదిలి వద్ద చిత్రావతి నదిపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించి, వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామ్‌స్వరాజ్ యోజన ద్వారా చిత్రావతి వంతెన నిర్మాణానికి రూ.8.52కోట్లు మంజూరయ్యాయి. మంత్రి సవిత జూలై 2 భూమి పూజ చేసి ప్రారంభించారు. మూడునెలలు గడుస్తున్నా వంతెన పనులు ప్రారంభించకపోవడంలో ఈఎన్సీ చిత్రావతి నది ప్రాంతాన్ని ఆదివారం సందర్శించారు. ఆయనతోపాటు అనంతపురం పీఆర్ ఎస్ఈ చిన్నసుబ్బరాయుడు, పుట్టపర్తి పీఐయూ డివిజన్ పీఆర్ ఈఈ కొప్పుల శంకరయ్య, పెనుకొండ డీఈఈ తిరుమలరెడ్డి ఉన్నారు. పనులు ఎందుకు ప్రారంభించలేదని కాంట్రాక్టర్ రమణారెడ్డిని ఆయన ప్రశ్నించారు. ఇతర పనుల బిల్లులు అందలేదనీ, కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వగా, పీఎంజీఎస్‌వై నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారి తెలిపారు. ప్రస్తుతం నదిలో ఉన్న నీటిని డైవర్షన్ ద్వారా పక్కకు పంపి వెంటనే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మల్లికార్జున, సర్పంచ్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు ప్రభుశంకర్, ఈడిగ రవి, లక్ష్మీపతి, హరినాథ్, సోమలింగారెడ్డి ఉన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు: సీఐ

మడకశిర టౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు. అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మడకశిర సర్కిల్ కార్యాలయంలో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరం చేసేవారిపై కఠినమైన చర్యలు ఉంటాయన్నారు.

'గెలుపోటములను సమానంగా తీసుకోవాలి'

మడకశిర టౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు సూచించారు. ఎంఎస్ఆర్-జీటీఎస్ టీ20 క్రికెట్ లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో టోర్నీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి కారణమవుతాయన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో సింహగిరి మడకశిర జట్టు 19.2 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ కాగా మడకశిర ఫ్రెండ్స్ లెవెన్ జట్టు 12 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. అభిమన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేంద్ర, కార్యదర్శి తిమ్మరాజు, సభ్యులు డాక్టర్ రవిశంకర్, శంకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా'

పెనుకొండ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా అని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ కులవివక్షత లేని సమాజం కోసం అణగారిన వర్గాల గళాన్ని కవిత్వంగా మలిచి తుదిశ్వాసవరకు పోరాడిన మహనీయుడు గుర్రం జాషువ అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు, మైనార్టీ రాష్ట్ర వింగ్ నాయకుడు అంద్రూస్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్, లీగల్‌సెల్ టీమ్ కంబాలపల్లి నరేష్, ఎస్సీకాలనీ యూత్ శివకుమార్ పాల్గొన్నారు.

వాల్మీకి ఉద్యోగ సంఘం ఎంపిక

మడకశిర టౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తెలిపారు. హిందూపురం పట్టణంలో జరిగిన సంఘ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడిగా పుట్టకామప్ప, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్ఈ విశ్వేశ్వర, గౌరవ సలహాదారుగా మూడ్లగిరియప్ప, కార్యదర్శిగా మారుతి, ఆడిట్ కన్వీనర్‌గా ఓబన్న, కార్యవర్గ సభ్యులుగా దేవరాజును ఎన్నుకున్నామన్నారు.

వైభవంగా చండీయాగం

హిందూపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీడిరోడ్డులో జగదాంబాదేవి విగ్రహం వద్ద ఆదివారం చండీయాగాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాగం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాగంలో డీఎస్పీ మహేష్, మున్సిపల్ చైర్మన్ రమేష్, అబ్దుల్‌కరీం, అమర్నాథ్, పార్థసారథి, నిమ్మకాయల రాము, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు